ఘనంగా సైన్స్ దినోత్సవం

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 28: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాధికారి ప్రణీత సందర్శించారు. రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. విద్యార్థులు తమలో దాగిఉన్న సృజనాత్మకతను మెరుగుపర్చుకోవాలని అన్నారు. అలాగే సరస్వతి నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర మేళా, ఉపన్యాస, రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పిల్లి కిషన్, అనురాధ, ఏఎంవో శ్రీకాంత్, సీసీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు భావితరాలకు ఆదర్శం

నార్నూర్, ఫిబ్రవరి 28 : విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఏసీఎంవో జగన్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జామడ గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌ను ఏసీఎంవో ప్రారంభించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తమలోని నైపుణ్యం, సృజనాత్మకతతో రూపొందించిన నూతన ఆవిష్కరణలు, ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. వాటికి సంబంధించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, కల్పనను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీఎంసీఆర్ అధికారులు గోవిందర్‌రావ్, శంకర్, ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, పీడీ విశ్వనాథ్, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో ఆలోచన ఉండాలి

జైనథ్, ఫిబ్రవరి 28 : శాస్త్రీయ దృక్పథంతో ఆలోచన ఉండాలని మేడిగూడ రోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యవాన్ అన్నారు. పాఠశాలలో విద్యార్థులు రకరకాల సైన్స్ చిత్రాలను రంగు రంగుల ముగ్గులతో వేసి అందరికీ అవగాహన కల్పిస్తూ వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొనిగెల నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్, ఫిబ్రవరి 28 : కౌర(బీ) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శశిధర్ రెడ్డి, వీడీసీ చైర్మన్ గాజుల సురేందర్, గంగయ్య, సాగర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోథ్‌లో..

బోథ్‌లోని నాగభూషణం పాఠశాలలో విద్యార్థులు ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కిశోర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైనథ్, ఫిబ్రవరి 28 : సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవార్చుకోవాలని తహసీల్దార్ శ్యాంసుందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజ్ఞాన శాస్త్ర ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌లో నిర్వహించి బయట తినకుండా విద్యార్థులు ఇంట్లో వండిన వంటకాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవన్న, ఎంపీటీసీ సుదర్శన్, ఉప తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సంతోష్, పీడీ దయానంద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాంసి, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ మేళాను నిర్వహించారు. జడ్పీటీసీ తాటిపల్లి రాజు నాయకులతో కలిసి సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురకుంటి మంజులాశ్రీధర్ రెడ్డి, ఎంఈవో శ్రీకాంత్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని సన్‌షైన్, గోల్డెన్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తయారు చేసిన సైన్స్ నమూనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సన్‌షైన్ పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల, కేజీబీవీలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డ్రీమ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వారు కేజీబీవీ విద్యార్థినులకు సైన్స్ కిట్ అందజేశారు. ఉపాధ్యాయులు డ్రీమ్ సంస్థ కోఆర్డినేటర్ పుష్పలతను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకాంత్, సునీల్, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

భీంపూర్, ఫిబ్రవరి28 : పిప్పల్‌కోటి, కరంజి(టీ), అంతర్గాం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహేశ్, భూమన్న, శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యం వెలికితీసేందుకు కృషి

ఉట్నూర్, ఫిబ్రవరి 28: విద్యార్థుల నైపుణ్యం వెలికితీసేందుకు కృషి చేస్తున్నామని లిటిల్ ఫ్లవర్ కరస్పాండెంట్ రాము, ప్రిన్సిపాల్ సెబాస్టియన్ అన్నారు. మండల కేంద్రంలోని లిటిల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. 70 మంది విద్యార్థులు తమ ప్రయోగాలను ప్రదర్శించారు. ఇందులో బెస్ట్ ప్రయోగాన్ని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న జడ్పీటీసీ

ఇచ్చోడ: సన్‌షైన్ పాఠశాలలో..

బోథ్: ప్రదర్శనలు తిలకిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఉట్నూర్ : ప్రయోగం గురించి వివరిస్తున్న విద్యార్థులు

మొరం అక్రమ తరలింపుపై చర్యలేవి?

- గుట్టలను తవ్వుతూ రూ.లక్షలు కొల్లగొడుతున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- కనుమరుగుతువున్న ప్రకృతి సంపద

ప్రభుత్వ కళాశాల పక్కనే జేసీబీ ద్వారా మొరం తవ్వకాలు

నార్నూర్, ఫిబ్రవరి 28 : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమార్కులు ప్రకృతి సంపద కొల్లగొడుతున్నా కాపాడాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో మండలంలో మొరం అక్రమ తరలింపునకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. అక్రమంగా గుట్టలు మొత్తం తవ్వేసి రూ.లక్షలు గడిస్తున్నారు. పట్టపగలే జేసీబీల సాయంతో గుట్టలు తవ్వి యథేచ్ఛగా ట్రాక్టర్లు, టిప్పర్లలో మట్టిని నిత్యం తరలిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో దందా సాగుతున్నా అధికార యంత్రాంగం అరికట్టలేకపోతోంది.

నూతన నిర్మాణాల కోసం...

మండల కేంద్రంలో అసైన్డ్ (ప్రభుత్వ) భూముల్లోని గుట్టలను ఇష్టానుసారంగా తవ్వేసి కనుమరుగు చేస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వదిలేయడంతో మట్టి అక్రమ తరలింపు మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలో ప్రభుత్వ అభివృద్ధి పనులు, ప్రైవేట్ భవనాలు, మట్టి రోడ్ల నిర్మాణాలకు మట్టి అవసరం కావడంతో మొరంకు విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో అధికారుల అనుమతి లేకుండా దందాను ఎంచుకున్నారు.

దృష్టి సారించని అధికారులు..

నూతన గృహ నిర్మాణాలకు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు గానీ ఏదేని అవసరాలకు గానీ మట్టిని తరలించాలంటే రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతి తప్పనిసరి. ముందుగా రెవెన్యూ శాఖ అనుమతి తీసుకొని తర్వాత మైనింగ్ శాఖకు నిర్ణీత పన్ను చెల్లించి అనంతరం మట్టి తవ్వకాలు చేపట్టాలి. కానీ నార్నూర్ మండలంలో ఈ నిబంధనలకు తిలోదకాల్చి మొరం ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఈ అక్రమ మొరం తరలింపుపై ఫిర్యాదులు చేసిన మొరం తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీలను పట్టుకొని జరిమానా విధించిన దాఖాలలు లేవన ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్ష రూపాయల అక్రమ దందా చేస్తున్న వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. మొరం అక్రమ తరలింపుపై కఠిన చర్యలు తీసుకొని ప్రకృతి సంపదను కాపాడాలని ప్రకృతి ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు తీసుకుంటా..

అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపట్టినట్లు తెలిసితే చర్యలు తీసుకుంటాం. మొరం తవ్వకాలకు సంబంధించి అనుమతి తప్పనిసరిగా తీసుకొవాలి. ప్రభుత్వ భూముల్లోని గుట్టల వద్ద మొరం తవ్వకాలు చేపట్టిన బాధ్యులపై తగు చర్యలు తీసుకొని, వాహనాలు కూడా సీజ్ చేస్తాం.

-జాడి రాజాలింగం, తహసీల్దార్, నార్నూర్

దేశభక్తి అలవర్చుకోవాలి

జ్యోతి వెలిగిస్తున్న సభ్యులు

ఉట్నూర్, ఫిబ్రవరి 28: విద్యార్థులకు చిన్నతనం నుంచే దేశభక్తి, క్రమశిక్షణ నేర్పించాలని ఐటీడీఏ అకాడమిక్ మానిటరింగ్ అధికారి జగన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కుమ్రం భీం ప్రాంగణంలో తెలంగాణ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో లీడర్స్‌కు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అన్ని పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కాంచనపల్లి రత్నాకర్, జిల్లా ట్రైబర్ స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి, అధికారులు రాంరెడ్డి, స్వామి, లక్ష్మి, మహేశ్, ఆర్‌పీలు గోవిందర్‌రావ్, శంకర్, యాదవ్‌రావ్, పీడీలు హేమంత్, కాశీరాం, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేనేజర్ నరేశ్

ఇచ్చోడ, ఫిబ్రవరి 28 : బ్యాంకు సేవల ఉపయోగం అవగాహన కార్యక్రమాల అంశాల గురించి గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడానికి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని బుధవారం ఎస్‌బీఐ మేనేజర్ నరేశ్, ప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్, కౌన్సిలర్లు వినోద్, సంతోష్, అరవింద్ గౌడ్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

జైనథ్, ఫిబ్రవరి 28 : మండలంలోని ఆయా గ్రామాల్లోని హెల్త్ సబ్ సెంటర్‌ల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నైనత అన్నారు. బుధవారం కూర హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రోగులకు వైద్యం అందిస్తున్న తీరును పరిశీలించారు. ఆమె వెంట ఏఎన్ ఎంలు వెంకటమ్మ, లత, గ్రామస్తులు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఉట్నూర్, ఫిబ్రవరి 28: ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూ పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. దవాఖానకు వచ్చే రోగులకు వైద్యం అందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఆయన వెంట కార్యకర్తలు ఉన్నారు.

పరామర్శ

నార్నూర్, ఫిబ్రవరి 28 : రాజుల్‌గూడ గ్రామానికి చెందిన గ్రేహౌండ్స్ కమాండో కానిస్టేబుల్ ఆడె ప్రవీణ్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ఎంపీ సోయం బాపురావ్ పరామర్శించారు. ఆయన వెంట నార్నూర్ సహకార సంఘం చైర్మన్ సురేశ్, మాజీ సర్పంచ్‌లు రాథోడ్ సావీందర్, బానోత్ గజానంద్ నాయక్, గ్రామ పెద్దలు ఉన్నారు.

స్టాఫ్ నర్సుకు సన్మానం

శ్వేతను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ, ఫిబ్రవరి 28: తలమడ్రి సబ్ సెంటర్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న శ్వేతకు శాశ్వత ఉద్యోగం రావడంతో బుధవారం వైద్య సిబ్బంది శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బ్రహ్మానంద రెడ్డి, వైస్‌ఎంపీపీ జాదవ్ భీంరావ్, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు రాథోడ్ కైలాస్, హెచ్‌ఏ సుభాష్, ఏఎన్‌ఎం పార్వతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుడిని పంపలేం

నేరడిగొండ, ఫిబ్రవరి 28 : తేజాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని వారిలో ఒకరిని డిప్యూటేషన్‌పై పంపించలేమని గ్రామాభివృద్ధి కమిటీ, పిల్లల తల్లిదండ్రులు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పాఠశాల మూతపడే పరిస్థితిలో ఉంటే, భవనాలు శిథిలావస్థకు చేరుకోగా క్రమక్రమంగా గ్రామస్తుల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలు ప్రైవేట్‌కు వెళ్లే పరిస్థితి లేనందున వీవీలను వీడీసీ ఆధ్వర్యంలో నియమించుకొని ముందుకు తీసుకెళ్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా మా ఆందోళనను అర్థం చేసుకొని డిప్యూటేషన్ ఆలోచన విరమించుకోవాలని డీఈవో, ఉపాధ్యాయ సంఘాలను కోరారు.

ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓటింగ్

గుడిహత్నూర్, ఫిబ్రవరి 28 : గుడిహత్నూర్ మండల ప్రజా పరిషత్ మండలాధ్యక్షుడి ఎన్నిక వాయిదా పడింది. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ప్రిసైడింగ్ అధికారి వెంకటేశ్వర్లు అధ్వర్యంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీటీసీలు కేంద్రె న్యాను, వత్సలాబాయి, శగీర్ ఖాన్, కాంగ్రెస్ ఎంపీటీసీలు పెందూర్ లలిత, అంకతి సవిత, కృష్ణవేణి, బీజేపీ ఎంపీటీసీలు కోవ తులసి, నాగర్‌గోజే భరత్ పాల్గొన్నారు. అధ్యక్ష పదవికి బీఆర్ఎస్ అభ్యర్థిగా కేంద్రె న్యాను, కాంగ్రెస్ అభ్యర్థిగా పెందూర్ లలిత ఉండగా వీరిద్దరికి సమానంగా సభ్యులు చేతులు ఎత్తారు. బీజేపీ సభ్యులు తటస్థంగా ఉండడంతో ఎవరికి మెజార్టీ రాలేదు. దీంతో గురువారం నాటికి వాయిదా వేస్తున్నట్లు ప్రిసైడింగ్ అధికారి వెంకటేశ్వర్లు ప్రకటించారు. సభ్యులు నిర్ణయించిన సమయానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్త స్వేశిక్ (ఫైల్)

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 28 : బజార్‌హత్నూర్‌కు చెందిన కొత్త స్వేశిక్(20) బుధవారం హైదరాబాద్‌లోని రింగ్ రోడ్డుపై ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొత్త లక్ష్మణ్, మమత దంపతులకు ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు కొత్త స్వేశిక్(20) ఉన్నత చదువుల నిమిత్తం హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. బుధవారం ఉదయం తన స్నేహితులతో కలిసి కారులో రింగ్ రోడ్డుపై వెళ్తుండగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. కారులో నుంచి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికి వచ్చిన కొడుకు ఉన్నత చదువులు చదివి తమను చూసుకుంటాడని అనుకున్న తల్లిదండ్రులు కొడుకు ఇలా మృతి చెందడంతో కుటంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

నేటితో ముగియనున్న ఈకేవైసీ ప్రక్రియ

ఎదులాపురం,ఫిబ్రవరి 28 : రేషన్‌కార్డు ఉన్న వారందరూ ఈకేవైసీ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే ఈకేవైసీ గడువును అనేక సార్లు పెంచారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో రేషన్ కార్డు ఈకేవైసీ ప్రక్రియను ప్రారంభించారు. అయితే ఆధార్ అప్‌డేట్ లేని కారణంగా ప్రజల ఇబ్బందులును గుర్తించి ప్రభుత్వం ఈ నెల 29వ తేదీ వరకు పొడిగించారు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్‌ను సంప్రదించగా రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో లక్ష 91 వేల కార్డుదారులున్నారని తెలిపారు. ప్రస్తుతం 80 శాతం వరకు పూర్తి అయిందన్నారు. మిగతా వారు కూడా గురువారం సాయంత్రంలోగా ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

ఘనంగా అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవం

నాందేవ్ మహారాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేరు సంఘం నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 28 : పట్టణంలోని బీసీ సంఘ భవనంలో మేరు సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘ జెండాను ఆవిష్కరించి అనంతరం నాందేవ్ మహారాజ్ చిత్రపటానికి, టైలర్ మిషన్‌కు పూజలు చేశారు. కార్యక్రమంలో మేరు సంఘం పట్టణ అధ్యక్షుడు పెద్దవారు సంతోష్, ప్రధాన కార్యదర్శి భీమేశ్, సభ్యులు రామకృష్ణ, రాజు, వెంకటేశ్, గజానంద్ పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నాగవంశీ, అట్లూరి వెంకి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 : సార్ సినిమా నిర్మాత నాగవంశీ, దర్శకులు అట్లూరి వెంకి, సావర్ ఖేడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రంగయ్య వివిధ పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు అందజేశారు. బుధవారం యాపల్‌గూడ, పొచ్చర ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేల చొప్పున విలువ చేసే పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గంగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన నాయకులు

మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 28 : ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా మొహమ్మద్ ఖమర్ హైమద్ బాధ్యతలు స్వీకరించారు. ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు బుధవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కలిసిన వారిలో సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్ విలాస్, అధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కర్యదర్శి కాంతారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేందర్, ఉప ప్రధాన కార్యదర్శి రాములు, కోశాధికారి నక్క శంకరవ్వ, సలహాదారుడు శేఖర్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపిక

విద్యార్థినిని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

బోథ్, ఫిబ్రవరి 28: కన్గుట గ్రామంలోని జడ్పీఎస్ఎస్‌కు చెందిన నల్ల అర్చన రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. గైడ్ టీచర్‌గా సైన్స్ ఉపాధ్యాయుడు నిఖిలేశ్ వ్యవహరించారు. విద్యార్థినిని గైడ్ టీచర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇదాపు పోశెట్టి, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ దావులే బాలాజీ

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 28: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరాం జాదవ్ అన్నారు. బుధవారం శ్యాంపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్యాంపూర్ జాతర సందర్భంగా పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్, మాజీ మండలాధ్యక్షుడు సింగారే భరత్, నాయకులు స్వామి, రమేశ్, హరీశ్, అశోక్, అరుణ్, అంజన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

నార్నూర్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 292 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 282మంది హాజరైనట్లు సీహెచ్ వెంకటరమణ తెలిపారు. 10 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

తాంసి, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను సిబ్బంది తనిఖీలు చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. మొదటి సంవత్సరం 448 మంది విద్యార్థులకు 436 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రంలో 307 మంది విద్యార్థులకు 252 మంది పరీక్ష రాశారు. 55 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ ధన్‌రాజ్, శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా మండల కేంద్రంలోని క్రిసెంట్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 183 మంది విద్యార్థులకు 171 మంది పరీక్ష రాశారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఇచ్చోడ, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆశ్రమ గిరిజన కళాశాల (బాలికల), ఆశ్రమ గిరిజన కళాశాల (బాలుర)లో మొత్తం 1508 మంది విద్యార్థులకు 150 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. నేరడిగొండ, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్షకు 272 మంది విద్యార్థులకు పది మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ శభానాతర్నం తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని ఆమె కోరారు.

ధ్యాన శిక్షణ తరగతులు ప్రారంభం

ధ్యాన శిక్షణలో పాల్గొన్న వైద్యులు, వైద్య విద్యార్థులు

ఎదులాపురం, ఫిబ్రవరి 28 : రిమ్స్ అడిటోరియంలో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ, శ్రీ రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధ్యాన శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హైదరాబాద్ నుంచి హార్ట్‌ఫ